క్లుప్తంగా

రంజాన్ కానుకలు పంపిణీ



కానుకలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఉస్మానియా కాలనీ, హడ్కోకాలనీలో తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ కానుకలను మైనార్టీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అహ్మద్, తారిక్, అఫ్సర్, అబుల్ ఫయాజ్, రహమాన్ పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు సౌకర్యాలు కల్పించాలి



ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

సిర్పూర్(టి): రంజాన్ వేడుకలకు సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని ఈద్గాలు, ఖబరస్తాన్‌ల వద్ద గ్రామపంచాయతీ అధికారులు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం ముస్లింలు ఈవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. వేసవిలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రంలో ఉన్న రెండు ఈద్గాల వద్ద టెంట్లు, తాగునీటి వసతి కల్పించడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. ఖబరస్తాన్‌లలో ఎల్ఈడీ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫాత్‌హుస్సేన్, హసీఫ్ ఖరీక్, ఇమ్రాన్, మక్బూర్, హర్షద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామశివారులో సోమవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకొని, రూ.5500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ఎస్‌బీఎంపై శిక్షణ

కెరమెరి: ఆసిఫాబాద్ మండలంలోని జన్కాపూర్‌లో గల రైతువేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎస్‌బీఎం ఫేజ్ -2పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీవో సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు, వీవోఏలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

కౌటాల: మండల కేంద్రంలో లావణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీగా స్పందన వచ్చినట్లు నిర్వాహకులు వెంకటేశ్ తెలిపారు. శిబిరంలో 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రోజ్, శ్రీనివాస్, శివాని, నూతన్, ఉమాదేవి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : రుద్రుడు
కాగజ్‌నగర్
వెంకటరమణ : రుద్రుడు
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

ఇదేమి 'పంచాయితీ'..!

- పారిశుధ్య కార్మికులకు అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- రోడ్డెక్కి నిరసనకు దిగిన వైనం



జీతాలు చెల్లించాలని రోడ్డుపై బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులు జీతాల కోసం సోమవారం రోడ్డెక్కారు. నెలల తరబడి వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు పలికారు.

ఆర్థికంగా అవస్థలు

ఎండా, వాన, చలి తీవ్రతను తట్టుకుంటూ పారిశుధ్య కార్మికులు రోడ్లపై ఉన్న చెత్తాచెదారం, మురికి కాల్వలను శుభ్రం చేస్తున్నారు. అయినా వారికి నెలనెలా జీతాలు అందకపోవడంతో ఆర్థికంగా అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. జీతాల కోసం రోడ్డెక్కితే గానీ అధికారులు స్పందించడం లేదంటూ వాపోతున్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతున్నా తమ గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో తిప్పలు..

స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ గ్రామాల పేరుతో ప్రభుత్వం వేలకోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తోంది. కానీ స్వచ్ఛత పనుల్లో నిమగ్నమవుతున్న పారిశుధ్య కార్మికులకు మాత్రం జీతాలు అందించడం లేదు. దీంతో వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు, తడి, పొడి చెత్త సేకరణకు నిధులు కేటాయిస్తున్నారు. నిత్యం స్వచ్ఛత కోసం శ్రమించే కష్టజీవులకు మాత్రం నెలనెలా కనీస వేతనాలు కూడా అందడం లేదు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో అనేక మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. స్వచ్ఛత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న కార్మికులు సరైన వేతనాలు లేక ఏళ్లుగా వెట్టిచాకిరికి గురవుతున్నారు. దీంతోపాటు వారికి ఆరోగ్య భద్రత కూడా కరువైంది. మురుగు కాలువల్లో దిగి శుభ్రం చేస్తున్న క్రమంలో చర్మవ్యాధులు, శ్వాస సంబంధిత వ్యాధులతో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారు.

బీమా కరువు..

పారిశుధ్య కార్మికులు మురికి కాల్వలు, వీధులను శుభ్రం చేస్తున్న క్రమంలో ఏదైన ప్రమాదాలకు గురైతే పట్టించుకునేవారే కరువయ్యారు. ఎలాంటి బీమా వారికి వర్తించడం లేదు. ప్రమాదాలకు గురైతే, అనారోగ్యం పాలైన పరిస్థితుల్లో కూడా వీరికి ప్రభుత్వ పరంగా, గ్రామపంచాయతీల పరంగా ఎలాంటి ఆరోగ్యభద్రత కల్పించడం లేదని వాపోతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదంటున్నారు. ఈ విషయమై ఎంపీవో రమేశ్ రెడ్డిని వివరణ కోరగా బెజ్జూర్ గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రమే గత ఐదు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. మిగితా గ్రామపంచాయతీల్లో రెండు నెలల జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. త్వరలోనే నిధులు వస్తాయని ఉన్నతాధికారులు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

పది నెలలుగా జీతం లేదు



పది నెలల నుంచి జీతాలు ఇస్తలేరు. రోజూ సార్లను అడిగితే రేపుమాపు అంటూ చెబుతున్నారు. జీతాలు రాకపోవడంతో బయట అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇచ్చే చాలీచాలని వేతనాలు కూడా నెలనెలా ఇస్తలేరు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలి.

- కొండ్ర బాపు, కామేటి, పెద్దసిద్దాపూర్ గ్రామపంచాయతీ

మంచం పట్టిన మురళీగూడ



మురళీగూడలో వైద్యశిబిరం (ఫైల్)

- ప్రతీ ఇంట్లో జ్వరపీడితులు
- ఆందోళనలో గ్రామస్తులు
- వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న అధికారులు



ఇంట్లోనే చికిత్స పొందుతున్న రోగి

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడలో విష జ్వరాలు విజృంభిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో 150 వరకు కుటుంబాలు ఉండగా ప్రతీ ఇంటిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా జ్వరంతో బాధపడుతున్నారు. గత పదిరోజులుగా గ్రామంలో జ్వరాలు విజృంభిస్తుండగా పదుల సంఖ్యలో ప్రజలు తీవ్ర జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు.

అదుపులోకి రాని జ్వరాలు..

గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయనే సమాచారంతో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఇప్పటికే గ్రామంలో రెండుసార్లు ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహించి రోగుల వద్ద నుంచి రక్తనమూనాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు సైతం అందజేశారు. కొందరు జ్వరపీడితులు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. మరికొంత మంది ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు.

ఆందోళనలో గ్రామస్తులు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఊరంతా జ్వరాలు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత పదిరోజులుగా చికిత్స తీసుకున్నా జ్వరాలు తగ్గడం లేదని ఆందోళన చెందుతున్నారు. తీవ్ర జ్వరంతో చిన్నపిల్లలు, వృద్ధులు గజగజ వణికిపోతున్నారు. ఉన్నతాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పకడ్బందీగా వైద్యపరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్తనమూనాలు సేకరించాం

గ్రామంలో జ్వరాలను అరికట్టడానికి ఇప్పటికే రెండుసార్లు ప్రత్యేకంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందజేశాం. 26 మంది జ్వరపీడితుల నుంచి డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణ కోసం రక్తనమూనాలు సేకరించాం. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాం. గ్రామంలో మరో రెండు రోజుల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తాం.

- అమన్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెంచికల్‌పేట్

నల్లబ్యాడ్జీలతో పంచాయతీ కార్యదర్శుల నిరసన



కౌటాల: ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

కౌటాల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి అన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈనెల 28వ తేదీ నుంచి చేయనున్న సమ్మె నోటీస్‌ను సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీపీ విశ్వనాథ్‌కు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు కవిత, గణేష్, భాస్కర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన సంస్కృతి జ్ఞాన పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ధర్మారావు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తెలుగు పండితులు మాడుగుల నారాయణ మూర్తి, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, ఆచార్యులు శ్రీరాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న ప్రసాద్

ఆసిఫాబాద్‌రూరల్: అనాథ ఆడబిడ్డ వివాహానికి యువకుడు ఆర్థిక సాయం అందజేశాడు. మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన యువకుడు ప్రసాద్ అదే గ్రామానికి చెందిన అనాథ ఆడబిడ్డకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశాడు. గ్రామస్తులు శివ, శ్రీను, ధర్మయ్య, అరుణ్ ఉన్నారు.

సమగ్రాభివృద్ధిపై సమావేశం

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధిపై అన్ని శాఖల అధికారులు, సభ్యులు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. మండల పంచాయతీ అధికారి శివకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏపీవో శ్రావణ్ కుమార్, సీడీపీవో రెబ్కా, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ కోత.. ఉక్కపోత!

- అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా
- టెక్నాలజీ పెరిగినా.. మెరుగుపడని పనితీరు
- ఇబ్బందుల్లో మండల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్

ఒక పక్క ఎండలు మండుతుంటే, మరో పక్క కరెంట్ కోతలు పల్లెవాసుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. 24 గంటలపాటు కరెంట్ సరఫరా చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ ప్రకటనలు అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. చిన్నపాటి గాలి వీస్తేనే మండలంలో కరెంట్ సరఫరా నిలిచిపోయి గంటల తరబడి రావడం లేదు. దీంతో పల్లెలు అంధకారంలో మునిగిపోతున్నాయి.

కౌటాల: తెలంగాణ ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ స్థానిక విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని గ్రామాల్లో కరెంట్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఎండాకాలం, వర్షాకాలం ఏదైనా ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. మండలంలో ఎప్పుడు కరెంట్ పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మెరుగైన విద్యుత్ వ్యవస్థ లేకపోవడంతో మండల పరిధిలోని గ్రామాల ప్రజలు కరెంట్ కష్టాలు ఎదుర్కొంటున్నారు.

ఉక్కపోత తిప్పలు

అసలే ఎండలు మండుతున్నాయి, ఈ సమయంలో విద్యుత్ కోతలుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఎండల కారణంగా ఇళ్లకే పరిమితమైన జనం ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో జనం విలవిల్లాడుతున్నారు. కరెంటు కోతలతో ఉక్కపోత, దోమల మోతతో రాత్రి వేళల్లో నిద్రకు దూరమవుతున్నారు.

పట్టింపులేని అధికారులు

కౌటాలలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, వెల్డింగ్ షాపులు, ఇతర వ్యాపార సముదాయలు ఉండడంతో సబ్‌స్టేషన్‌పై అధికంగా లోడు పడుతోంది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో సాయంత్రం సమయంలో ఈదురుగాలులు వీస్తుండడంతో విద్యుత్ వైర్లు తెగిపడి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో గంటల తరబడి కరెంట్ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉందని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి గాలి వీచినా, చిరుజల్లులు కురిసినా విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్ స్తంభాలను ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించకపోవడంతో గాలి దుమారాలకు చెట్ల కొమ్మలు వైర్లకు తగిలి కరెంట్ సరఫరా నిలిచిపోతోంది. సమస్య తరుచూ ఉత్పన్నమవుతున్నా అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. అధికారులు సమస్య పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఉక్కపోత భరించలేకపోతున్నాం

మండలంలో కరెంట్ సరఫరా దారుణంగా ఉంది. విద్యుత్ అధికారులు తరచూ కరెంట్ కట్ చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేసవికాలం కావడంతో ఉక్కపోత భరించలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఆర్.ప్రవీణ్, యాపలగూడ

అధికారులు పట్టించుకోవడం లేదు

మండలంలో ఇష్టం వచ్చినట్లు కరెంట్ సరాఫరా నిలిపివేస్తున్నారు. కరెంట్ అంతరాయం గురించి తెలుసుకుందామంటే విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండడం లేదు. గ్రామాల్లోని కరెంట్ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి కరెంట్ అంతరాయం లేకుండా చూడాలి.

- నారాయణ, గురుడుపేట్

వీఓఏల నిరవధిక సమ్మె



సిర్పూర్(టి): సమ్మె చేస్తున్న వీఓఏలు



పెంచికల్‌పేట్: సమ్మె చేస్తున్న వీఓఏలు

పెంచికల్‌పేట్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు సోమవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. అంతకుముందు ఏపీఎం కోనయ్య, ఎంపీడీవో గంగాసింగ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ ఏళ్లుగా పనిచేస్తున్న వీఓఏలకు పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. రోజా, రవి, సంగీత, అంకిత, భాగిలాల్ పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని వీఓఏలు ఐకేపీ కార్యాలయం ఎదుట సమ్మె ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ రియాజ్ అలీ, ఎస్సై రమేశ్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం దుర్గయ్యలకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జాడె అనిల్, మండల అధ్యక్షుడు అంగల సతీష్, గౌరవ అధ్యక్షుడు నాగపురె పాండు, ప్రధాన కార్యదర్శి బోర్కుటె జయంత్, వీఓఏలు దామోదర్, డొంగ్రె జ్యోతి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని మండల వీఓఏల సంఘం అధ్యక్షుడు తోరె నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీవో మహేందర్‌లకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

కౌటాలలో..

కౌటాల: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు అన్నారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట సోమవారం నిరవధిక సమ్మె చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు ఏపీఎం వెంకటరమణ, ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు. నిరవధిక సమ్మె నోటీస్‌ను స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. సమ్మెలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు రవి, కరుణాకర్‌గౌడ్, దేవాజీ, మహేశ్వరి, ప్రతిభ, ఇందు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ప్రారంభం..

కాగజ్‌నగర్‌టౌన్: ఐకేపీలో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన సమ్మె సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ మాట్లాడుతూ వీఓఏల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు.



కౌటాల: నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏలు



చింతలమానెపల్లి: వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

మిషన్ భగీరథ నీటి సరఫరా

కెరమెరి: ఏడాది కాలంగా నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డ మండలంలోని కొత్త పాట్నాపూర్ గ్రామానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు. ఇటీవల ఐటీడీఏ ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకు అందించగా, మిషన్ భగీరథ ద్వారా అందించిన నీటిని సోమవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ఎంపీపీ అబ్దుల్ కలాం, పీటీసీ సూపర్‌వైజర్ సిడాం ధర్మూ ప్రారంభించారు.



నీటి సరఫరా ప్రారంభిస్తున్న ఎంపీపీ

స్థల పరిశీలన

బోథ్: బోథ్ మండలానికి మంజూరైన బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి సోమవారం బీఎస్ఎన్ఎల్ అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో డీఈ రంజిత్, జేటీవో నరేశ్, తదితరులు పాల్గొన్నారు.